భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37.0
కనిష్ఠం : 20.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:27 (మంగళ)
సహారి : 4:29 (బుధ)



• ఉగాది వేడుకలో..

నేడు ఉగాది. ఈ రోజు నుంచి శ్రీ క్రోధి నామ సంవత్సరం ప్రారంభం. తీపి, చేదు, పులుపు, వగరు, కారం, ఉప్పుల షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడి. ఈ పచ్చడి మాదిరే జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలు, బాధ, సంతోషాలను సమపాళ్లల్లో తీసుకోవాలని చెప్పేదే.. ఈ పండుగ పరమార్థం. పండుగకు మేం సిద్ధం అంటూ పెనుగొండ భాష్యం స్కూల్ చిన్నారులు వేప పువ్వు, మామిడి కాయలు కోస్తూ ఇలా కనిపించారు. సోమవారం భీమవరం సహా మిగిలిన మార్కెట్‌లన్నీ కళకళలాడాయి. ప్రత్యేక కథనం 9లో..

• గొడుగుల నీడలో..

గడిచిన నాలుగు రోజులుగా భానుడి ప్రతాపానికి జిల్లావాసులు విలవిల్లాడుతున్నారు. ఉదయం ఎనిమిది గంటలకే ఎండలతోపాటు ఉక్కపోత తోడు కావడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తీరంలో సముద్ర గాలులు వీస్తుండటంతో శరీరమంతా జిడ్డుతో చెమటలు పట్టేస్తున్నాయి. ఎండ ధాటికి తట్టుకోలేక సోమవారం నరసాపురంలో గొడుకులు చేతపట్టి విద్యార్థినులు పాఠశాల నుంచి వస్తున్నారు.



రెండు వారాలన్నారు..
75 రోజులైంది

- ఆసరా సొమ్ముల కోసం జగన్ బటన్ నొక్కి చాలా కాలమైందంటూ మహిళల ఎదురుచూపులు
- 27,004 గ్రూపులకు రూ.275.90 కోట్లు జమ కావాలి

భీమవరం రూరల్, ఏప్రిల్ 8 : సీఎం జగన్ నాలుగో విడత ఆసరా సొమ్ముల బటన్ నొక్కి 75 రోజులు దాటింది. ఈ సొమ్ము రెండు వారాల్లో మీ ఖాతాల్లో పడుతుందని ఆ సమయంలో ఆయన చెప్పారు. కాని ఇప్పటి వరకు మహిళల ఖాతాల్లో జమకాలేదు. వీరంతా రోజూ తమ బ్యాంకు ఖాతాలను చెక్ చేసుకుంటూనే ఉన్నారు. జిల్లాలో ఆసరా నాల్గవ విడత సొమ్ము 27 వేల 4 గ్రూపులకు రూ.275 కోట్లు 90 లక్షల రూపాయిలు మహిళలకు వారి ఖాతాలలో జమ చేయించాలి. ఎస్సీ, ఎస్టీ గ్రూపుల్లో కొందరికి అరకొరగా సొమ్ము పడినట్లు చెబుతున్నారు. బీసీ, ఓసీ గ్రూపులకు ఏ ఒక్కరికి జమ కాలేదు. దీనిపై మహిళలలో నిరుత్సాహం నెలకొంది. పథకాలు అమలు చేస్తున్నామని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటపు కబుర్లు చెబుతున్నా అమలు తీరులో జాప్యం కొనసాగుతూనే వుంది. ఆసరా పథకం ఇలాగే ఉంది. పథకం ఆదిలో మొదటి విడత అక్టోబర్‌లో అమలు చేశారు. మూడవ విడత 2022 నవంబరులో సొమ్ములు ఖాతాల్లో పడాలి. అలాంటిది 2023 మే వరకు ఎస్సీ, ఎస్టీ గ్రూపులకు ముందుగా తదుపరి బీసీ గ్రూపులకు చివరిగా ఓసీ గ్రూపులకు వేస్తూ వెళ్ళారు. నాలుగో విడత ఆసరా సొమ్ముకు ఈ ఏడాది జనవరి 23న జగన్ బటన్ నొక్కారు. మూడవ నెల చివరికి చేరుతోంది.మహిళలు బ్యాంకులకు వెళ్ళడం సొమ్ము పడిందా వివరాలు అడగడం సిబ్బంది పడలేదని చెప్పడం ఇది మహిళల్లో వ్యతిరేకతకు దారితీసింది. బటన్ నొక్కినా.. సొమ్ములు జమకాలేదు. ఇంతలో ఎన్నికల సమయం దగ్గర పడుతుందన్న ఆలోచనతో కొందరు ప్రజాప్రతినిధులు ఆసరా సొమ్ము వస్తుంది. వాటితో పాటు చీరలు గిఫ్ట్‌గా ఇస్తున్నామని సభలు పెట్టి మరీ ప్రచార ఆయుధంగా వాడుకున్నారు. ఇప్పటికీ సొమ్ములు రాకపోవడంతో మహిళల్లో ఇచ్చిందే కొంత ఎన్నాళ్లో పడిగాపులు విమర్శలకు దారితీస్తోంది. జిల్లాలో 27 వేల గ్రూపుల వరకు ఉంటే వీరిలో సమాన రుణమాఫీ పొందలేదు. ఒక గ్రూపుకు రూ.30 వేల లబ్ధి మరో గ్రూపుకు రూ.20 వేలు, ఇంకో గ్రూపుకు రూ.90 వేలు ఇలా తక్కువ రుణ మాఫీ అయిన వారిలో ఇదెక్కడి విధానం అనే నిరుత్సాహం నెలకొంది.

మే 5, 6 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ స్వీకరణ



భీమవరం టౌన్, ఏప్రిల్ 8 : ఎన్నికల విధులు నిర్వహించే వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అంతా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ సోమవారం తెలిపారు. ఇందుకు ఫారమ్-12 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నామినేషన్ల పరిశీలన పూర్తయిన తర్వాత పోస్టల్ బ్యాలెట్ల పత్రాల ముద్రణ జరుగుతుందన్నారు. మే 5, 6 తేదీల్లో ఈ బ్యాలెట్ల స్వీకరణకు ఏర్పాట్లు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించామన్నారు.

తాగు నీటి సమస్యలపై కంట్రోల్ రూమ్

వేసవి దృష్ట్యా జిల్లాలో ఎక్కడైనా తాగునీటి సమస్యలు ఏర్పడితే వాటి పరిష్కారానికి భీమవరం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎక్కడైనా తాగునీటి ఇబ్బందులు వుంటే 08816-299616 నెంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేస్తే తక్షణం పరిష్కరిస్తామన్నారు.

ఉండిలో ఉండేదెవరు?

ఎంపీ రఘురామ పార్లమెంట్‌కా ? అసెంబ్లీకా ?.. ఏది బెటర్ ?

జిల్లాలో ఐవీఆర్ సర్వే

- ఎమ్మెల్యే రామరాజుకు చంద్రబాబు పిలుపు.. హైదరాబాద్‌లో భేటీ.. రెండు రోజుల్లో పూర్తి స్పష్టత

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఉండి నియోజకవర్గంపై కూటమిలో ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ఎమ్మెల్యే రామరాజుకు టీడీపీ అధినేత చంద్రబాబు నుంచి పిలుపువచ్చింది. అధినేతను కలిసేందుకు ఆయన సోమవారం హైదరాబాద్ పయనమయ్యారు. చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఇప్పటికే ఈ నియోజకవర్గం నుంచి ఎంపీ రఘురామకృష్ణంరాజు పోటీ చేస్తారంటూ ప్రచారం సాగుతోంది. చంద్రబాబు నుంచి జిల్లా ముఖ్య నేతలకు ఆ దిశగా సంకేతాలందాయి. ఈ నేపథ్యంలో రామరాజుకు చంద్రబాబు నుంచి పిలుపు రావడం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. వాస్తవానికి ఉండి టీడీపీకి కంచుకోట. ఈ దఫా కూడా ఆ పార్టీకే విజయవకాశాలు స్పష్టంగా ఉన్నట్టు సర్వేలు చెబుతున్నాయి. అయితే ఎంపీ రఘురామకు నర్సాపురం ఎంపీ టిక్కెట్ దక్కకపోవడంతో స్థానికంగా అంతా ఆత్మరక్షణలో పడ్డారు. వైసీపీపైన, జగన్‌పైనా పోరాటం చేస్తూ వచ్చిన ఆయనకు టిక్కెట్ ఇవ్వకపోవడంపై రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చే నడిచింది. నిజానికి బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల్లోని ఏదో పార్టీ నుంచి ఆయనకు ఇక్కడ ఎంపీ టిక్కెట్‌పై పోటీ చేస్తారని అంతా భావించారు. కాని, బీజేపీ నుంచి వర్మకు టిక్కెట్ కేటాయించారు. ఇక ఎంపీ టిక్కెట్‌కు అవకాశం లేకపోవడంతో చివరకు ఎమ్మెల్యే టిక్కెట్ అయినా ఇవ్వాలని టీడీపీ నిర్ణయించింది. నర్సాపురం పరిధిలోని ఉండిపైనే అధినేత దృష్టి పెట్టారని చర్చ సాగుతోంది. మరోవైపు రఘురామ పార్లమెంట్‌కు పోటీ చేస్తే బాగుంటుందా ? ఎమ్మెల్యేకు పోటీ చేస్తే మంచిదా ? అంటూ సోమవారం జిల్లాలో ఐవీఆర్ సర్వే నిర్వహించారు. కాని, రఘురామ మాత్రం మొదటి ప్రాధాన్యత ఎంపీగా పోటీ చేసేందుకే మక్కువ చూపుతున్నారు. అయితే టీడీపీ అధిష్ఠానం ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ పోటీ చేయకతప్పదంటూ ఇది వరకే స్పష్టం చేశారు. ఆ దిశగానే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఒకటి, రెండు రోజుల్లో ఈ స్థానంపై పూర్తి స్పష్టత రానుంది.


ఎంపీ రఘురామ




ఎమ్మెల్యే రామరాజు

మంత్రి కొట్టును మారుస్తున్నారా ?



తాడేపల్లిగూడెం వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే మంత్రి కొట్టు సత్యనారాయణను పార్టీ అధిష్ఠానం ప్రకటించడంతో ఆయన ఇప్పటికే ప్రచారం చేసుకుంటున్నారు. అయితే నియోజకవర్గంలో ఆయనకు వ్యతిరేక గాలులు వీస్తున్నాయని, ఈ మేరకు నివేదికలు వెళ్లాయని, టికెట్ మార్పు ఖాయమంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఆయన స్థానంలో ఇటీవలే ఆ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యేకు ఇస్తారని అంతా భావిస్తున్నారు. ఆ నేత తన అనుచరవర్గంతో సంప్రదింపులు జరుపుతున్నారు. తనకే టిక్కెట్ అంటూ ఆయన ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ కేడర్ గందరగోళంలో పడింది. మరోవైపు అభ్యర్థి అనుకున్న ఒప్పందం ప్రకారం పార్టీ వద్ద సొమ్ములు డిపాజిట్ చేయలేదని సమాచారం. ఎంపీ అభ్యర్థి వ్యయంలోనూ ఇతర నియోజకవర్గాల మాదిరిగా ఆయన సహకరించాల్సి వుంది. ఏది ఏమైనప్పటికి పార్టీ తనకే టిక్కెట్ ఇస్తుందని ఆ మాజీ ఎమ్మెల్యే విశ్వ సిస్తున్నారు. ఆయన ధీమాగా చెప్పడంతోనే మంత్రి కొట్టు టిక్కెట్‌పై పార్టీ శ్రేణుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆరిమిల్లి

10న తణుకులో ప్రజాగళం

- చంద్రబాబు, పవన్ రోడ్ షో, భారీ బహిరంగ సభ
- జిల్లాలో రెండోసారి ఒకే వేదికపై ఇరువురి నేతలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో కూటమి అభ్యర్థులను ప్రకటించిన తర్వాత తొలిసారి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేనాని పవన్ కల్యాణ్ ఒకే వేదికపైకి కనిపించనున్నారు. ఈ మేరకు బుధవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు, నిడదవోలుల్లో ప్రజాగళం సభలను నిర్వహించనున్నారు. ఇరువురు నేతలు రోడ్ షో నిర్వహించి, తణుకు నరేంద్ర సెంటర్‌లో సభలో మాట్లాడతారు. ప్రజాగళం విజయవంతానికి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు సన్నాహాలు చేస్తున్నారు. ఆ రోజు ఇద్దరు నేతలు వేర్వేరుగా హెలీక్యాప్టర్లలో తణుకు పాలిటెక్నిక్ కళాశాలకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్ షోలో పాల్గొంటారు. నియోజకవర్గంలో జనసేన ఇన్‌ఛార్జ్ నుంచి కూటమి అభ్యర్థి ఆరిమిల్లికి సహకారం లేకపోయినా, ఆ పార్టీ నాయకులు, కేడర్ అంతా మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్నారు. ఇప్పటికే తాడేపల్లిగూడెంలో తెలుగుదేశం, జనసేన ఉమ్మడి సభను నిర్వహించాయి. ఇరు పార్టీల అధినేతల సభలో పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం సభ సూపర్ సక్సెస్ అయ్యింది. అదే తరహాలో తణుకులోనూ సభను విజయవంతం చేయాలనే పట్టుదలతో కూటమి నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. అభ్యర్థులు ప్రకటన తర్వాత ఇద్దరు నేతలు ఒకే వేదికపైకి రానుండడంతో కేడర్‌లోనూ జోష్ నెలకొంది.

భారీగా తరలిరండి : ఆరిమిల్లి పిలుపు

తణుకు, ఏప్రిల్ 8 : తణుకులో ఈ నెల 10న చంద్రబాబు, పవన్ కల్యాణ్ రోడ్ షో, ప్రజాగళం భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో బహిరంగ సభ ఏర్పాట్లు, సభ విజయవంతంపై టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పనిచేయాలని కోరారు. సభకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున, ఆ దిశగా తీసుకునే చర్యలపై చర్చించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, ఐతంపూడి శ్రీదేవి, డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, పరిమి వెంకన్నబాబు, బసవా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్
ఎమ్మెల్యే నిమ్మల
8

పవన్‌ను గెలిపించండి : పిఠాపురం వాసులకు జోగయ్య పిలుపు



పాలకొల్లు, ఏప్రిల్ 8 : పిఠాపురంలో పవన్ కల్యాణ్‌ను గెలిపించాలని కాపు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం బహిరంగ లేఖను విడుదల చేశారు. ఏళ్ల తరబడి కాపు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలంతా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉండడానికి రాజకీయంగా వెనుకబడి ఉండటమే కారణమన్నారు. జనాభా ప్రాతిపదికన యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి చేరుకోవాలన్నారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన పవన్ అంచెలంచెలుగా రాజ్యాధికారం చేపట్టే దిశగా ముందుకు పయనం సాగిస్తున్నట్లు చెప్పారు. పవన్‌ను అసెంబ్లీకి పంపించాల్సిన బాధ్యత పిఠాపురం ఓటర్లదేనన్నారు.

■ ఆంధ్రజ్యోతితో ఆఫీసర్

పటిష్ఠ బందోబస్తు

తాడేపల్లిగూడెం డీఎస్పీ డీఎస్ఆర్ మూర్తి



- ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు చేస్తున్నాం. 100 మంది పారామిలటరీ సిబ్బందితో పాటు మా సిబ్బందితో బందోబస్తుకు సిద్ధం అవుతున్నాం. పోలింగ్ బూత్‌ల వద్ద 144 సెక్షన్ విధిస్తాం.
- గత స్థానిక, సార్వత్రిక ఎన్నికలతో పాటు లాఅండ్ ఆర్డర్‌కు ఇబ్బంది కలిగించే వారిని ఇప్పటికే బైండోవర్ చేశాం. రౌడీ షీటర్‌లకు ఇప్పటికే స్టేషన్‌ల వారిగా పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించాం. వారితో సొంత పూచీకత్తుతో బైండోవర్ చేసి అల్లర్లు చేస్తే తీసుకునే చర్యలను తెలిపాం. అయినా వారు ఏదైనా సమస్య సృష్టిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటాం.
- తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాలలో 90 సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను గుర్తించాం. వాటి పరిధిలో పారా మిలటరి సిబ్బందితో కవాతులు నిర్వహించి, అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం.
- అనుమతులేకుండా డబ్బులు డంప్ చేయడంపై నిఘా పెట్టాం. వెంకట్రామన్నగూడెం వద్ద ఒక చెక్‌పోస్టు ఏర్పాటుచేశాం. దానితోపాటు ర్యాండమ్ చెకింగ్స్ నిర్వహిస్తున్నాం. అనుమతులు లేకుండా డబ్బు ఉందని సమాచారం తెలిస్తే 91549 65933 నెంబరుకు తెలపవచ్చు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.
- మహిళా సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. అవసరాన్ని బట్టి బయట నుంచి మహిళా సిబ్బందిని వినియోగిస్తాం. సచివాలయ మహిళా పోలీసులను ఇప్పటి వరకూ ఎన్నికల విధులకు వినియోగించడం లేదు. ఎన్నికల కమిషన్ సూచనల బట్టి వారి విధులపై ఆలోచిస్తాం.

\- తాడేపల్లిగూడెం క్రైం

చెత్త..ఊసే మరిచారు!

- 393 గ్రామాల్లో 363 కంపోస్టు యార్డులు
- టీడీపీ ప్రభుత్వం హయాంలోనే నిర్మాణం..
- పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- అంటు రోగాలకు నిలయాలుగా రహదారుల పక్కన చెత్త గుట్టలు..

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరిచేందుకు టీడీపీ ప్రభుత్వం హయాంలో కంపోస్టు యార్డులు ఏర్పాటు చేస్తే.. వైసీపీ ప్రభుత్వం వాటి వినియోగించడంలో విఫలమైంది. దీంతో గ్రామాల్లో అపారిశుధ్యం నెలకొని రహదారుల పక్కన చెత్త గుట్టలు అంటు వ్యాధులకు నిలయాలుగా మారాయి.

భీమవరం రూరల్, ఏప్రిల్ 8 : గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం.. అభివృద్ధి అంటేనే మా ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పిన వైసీపీ సర్కార్ క్షేత్ర స్థాయిలో చతికిలబడింది. చివరకు గ్రామాల్లో చెత్త మాటే మరిచారు. దీంతో ఏ గ్రామం చూసినా చెత్త పేరుకుపోయి కంపు కొడుతున్నాయి. గ్రామ సచివాలయాలంటూ పదుల సంఖ్యలో ఉద్యోగులను అందుబాటులోకి తెచ్చిన పారిశుధ్యంలో బాగా వెనుకబడ్డారు. గత ప్రభుత్వం హయాంలో చెత్త సేకరణకు ఏర్పాటు చేసిన కంపోస్టు యార్డులు ఉపయోగించడంలోను వెనుకబడ్డారు. దీంతో గ్రామాల్లో చెత్త చెదారంలో అపరిశుభ్రత తాండవిస్తోంది. జిల్లాలో 393 గ్రామాల్లో 363 కంపోస్టు యార్డులు చెత్త స్టోరేజ్‌కు నిర్మించారు. ఇవన్నీ టీడీపీ ప్రభుత్వం హయాంలోనే 90 శాతం పైగా నిర్మించబడ్డాయి. అప్పట్లోనే ఆ ప్రభుత్వం చెత్త సేకరణ, పొడి చెత్త, తడి చెత్త వేరు చేయడం వంటివి గ్రామాల్లో చేపట్టారు. చెత్త నుంచి సంపద తయారీ కూడా కొన్ని గ్రామాల్లో నిర్వహించారు. అదికాస్తా వైసీపీ ప్రభుత్వం వచ్చాక కొన్ని రోజులకే చెత్త సేకరణ అరకొరగా మారడం, అప్పటికే నిర్మాణమై ఉన్న కంపోస్టు యార్డులలో ఒక తట్ట చెత్త కూడా ఇప్పటికీ వేయకపోవడం, వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో చెత్త గుట్టలు ఎక్కడబడితే అక్కడ దర్శనమిస్తున్నాయి.

టీడీపీ ప్రభుత్వం హయాంలో గ్రామాల్లో కంపోస్టు యార్డు నిర్మాణానికి రూ.5లక్షలు పైగా పెట్టుబడి పెట్టారు. జిల్లా మొత్తం మీద 363 కంపోస్టు యార్డులకు కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టి నిర్మించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరుపయోగంగా మార్చడంతో ప్రజాధనం వృథా అయింది. ఇంకా జిల్లాలో 30 కంపోస్టు యార్డులు నిర్మాణంలో ఉన్నాయి. వాటి నిర్మాణంలో జాప్యం జరుగుతోంది.




ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉన్న పెదగరువు కంపోస్టు యార్డు

దుర్వాసన..అంటు రోగాలు

గ్రామాల్లో ఎక్కడబడితే అక్కడ చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు అంటురోగాలు ప్రబలుతున్నాయి. కంపోస్టు యార్డుల్లో చెత్తతో కంపోస్టు ఎరువు తయారీ చేయడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపకపోవడంతో చెత్త డంపింగ్ వరకే పరిమితంగా కొన్ని యార్డులు ఉంటే మరి కొన్ని అసలు చెత్తలేని యార్డులుగా ఉన్నాయి. కంపోస్టు ఎరువు అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంతో చెత్త సేకరణ సులువు అయ్యేది. అదిలేక పెద్దగా ఆదాయం లేని పంచాయతీలు చెత్త సేకరణ సిబ్బందిని మెయింటినెన్స్ చేయలేక చెత్త సేకరణ వదిలేశారు.


భీమవరం మండలం అనాకోడేరు సచివాలయానికి ఆమడ దూరంలో పెద్ద చెత్త గుట్ట దర్శనమిస్తుంది. దాని నుంచి వచ్చే దుర్వాసనతో సచివాలయ సిబ్బందే ఇబ్బంది పడుతున్నారు. అయినా ఆ చెత్త అక్కడే ఉండడం ప్రభుత్వం, అధికారుల పనితీరుకు నిదర్శనమంటూ విమర్శలు వస్తున్నాయి.

ముగిసిన పది మూల్యాంకనం

భీమవరం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 8 : వీరవాసరం ఎంఆర్‌కే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్యాంపులో జరుగుతున్న పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం ముగిసినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. 1,68,894 సమాధాన పత్రాలను 815 మంది ఉపాధ్యాయులు మూల్యాంకనం చేశారని తెలిపారు. ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షలు, మూల్యాంకనం ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన కలెక్టర్‌కి, సంయుక్త కలెక్టర్‌కి, ఇతర జిల్లా అధి కారులకు, ఎంఆర్‌కే పాఠశాల సిబ్బందికి, ఉపాధ్యాయులకు డీఈవో కృతజ్ఞతలు తెలిపారు.



16 కిలోల బంగారం, 30 కిలోల వెండి రవాణా

- విలువ రూ.12 కోట్లు.. మరో రూ.15 లక్షల నగదు స్వాధీనం.. కలపర్రు టోల్‌ప్లాజా వద్ద పట్టివేత
- ఆకివీడు వద్ద స్కూటీలో రూ.12 లక్షల నగదు సీజ్

\- మెయిన్‌లో..

నేటి నుంచి వీరపేరంటాలమ్మ ఉత్సవాలు



ఉండి, ఏప్రిల్ 8: ప్రసిద్ధి గాంచిన వీరపేరంటాలమ్మ అమ్మవారి 71వ ఉత్సవాలు మంగళవారం ప్రారంభిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి రుద్రరాజు ఫణికిశోర్ తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఫణికిశోర్ మాట్లాడుతూ 18వ తేదీ వరకు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మంగళవారం నడింపల్లి సీతారామ రాజు-అన్నపూర్ణ దంపతులచే కలశస్థాపన ఉంటుందన్నారు. రాత్రి 8గంటలకు పెన్నాడ వారిచే మేళతాళాలతోను, గరగల నాట్యంతోను, విచిత్ర వేషధారణలతో అమ్మవారి సేవ వుంటుందన్నారు. 11న కోలాటం, రాత్రి 6గంటలకు నిప్పులగుండం కార్యక్రమం ఉంటుందన్నారు.

మావుళ్ళమ్మ విగ్రహం అందజేత



మావుళ్ళమ్మ పంచలోహ విగ్రహం అందిస్తున్న భక్తులు

భీమవరం టౌన్, ఏప్రిల్ 8 : మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానానికి సోమవారం భీమవరానికి చెందిన హారిక పూజ సామగ్రి తయారీ దారుడు ఉదయ సూర్య భాను ప్రకాష్ పద్మ దంపతులు మావుళ్ళమ్మ అమ్మవారి 280 కేజీల పంచలోహ విగ్రహం అందజేశారు. సుమారు ఏడు లక్షల నలభై వేల రూపాయలతో విగ్రహాన్ని తయారు చేశారు. ముందుగా ప్రత్యేక పూజలు చేసిన అనంతరం దాతలు ప్రత్యేకవాహనంలో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు.

సిద్ధాపురం రైల్వేగేటు మూసివేత

ఆకివీడు, ఏప్రిల్ 8: రైల్వేగేటు మరమ్మతులు నేపథ్యంలో నాలుగు రోజులు బంద్ చేస్తున్నట్లు కైకలూరు సీనియర్ సెక్షన్ ఇంజనీర్ తెలిపారు. సిద్ధాపురం వైపు వెళ్ళు రైల్వేగేటులో పట్టాలు మార్పుతుండడంతో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి ఈ నెల 12వ తేదీ సాయంత్రం 7గంటలు వరకూ బంద్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు, స్థానికులు సహకరించాలని కోరారు.

అప్పులతో రాష్ట్రం నాశనం: సీతారామలక్ష్మి

భీమవరం అర్బన్, ఏప్రిల్ 8: రాష్ట్ర అభివృద్ధిని కుంటుపరిచి అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన ముఖ్యమంత్రి జగన్ మోసపూరిత అబద్ధాలు మాటలు మరోసారి నమ్మి ప్రజలు ఓటు వేసేందుకు సిద్ధంగా లేరని జిల్లా టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. జగన్ మోసాలను అరాచక హత్య రాజకీయాలను ఎన్డీఏ కూటమి నేతలు చంద్రబాబు పవన్ పురందేశ్వరీ ప్రజలలో విస్తృత ప్రచారం చేస్తున్నారన్నారు. అది తట్టుకోలేని జగన్ అబద్ధపు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు.

దళిత సమస్యలపై మేనిఫెస్టోలో పెట్టాలి

భీమవరం అర్బన్, ఏప్రిల్ 8: అన్ని రాజకీయ పార్టీలు దళిత సమస్యలపై మేనిఫెస్టోలో చేర్చాలని అందుకు కేవీపీఎస్ ఒక డిక్లరేషన్ రూపొందించిందని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ తెలిపారు. సోమవారం యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దళిత, బీసీ, గిరిజన, ప్రజా సంఘాల, వామపక్షాల నాయకులు హాజరయ్యారు. దళిత బహుజన ఏపీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కోనా జోసెఫ్, సీపీఎం జిల్లా కార్యదర్శి బి .బలరాం, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కోడే యుగంధర్, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లబ్‌లు సమాజసేవ చేయాలి

భీమవరం అర్బన్, ఏప్రిల్ 8: సమాజసేవ చేస్తూ తోటి వారికి క్లబ్‌లు ఆదర్శంగా నిలవాలని చైతన్య భారతి నాటక పరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్ అన్నారు. సోమవారం మార్నింగ్ కాఫీ క్లబ్ ఐడెంటీ కార్డ్స్‌ను భగవాన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా భగవాన్‌ని మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కన్వీనర్ బోండా రాంబాబు, కో కన్వీనర్‌లు ఓలేగి శ్రీనివాస్ గుప్తా, పీఆర్వో భట్టిప్రోలు శ్రీనివాస్, సభ్యులు మంతెన రామ్‌కుమార్ వర్మ, నడింపల్లి మహేష్ కుమార్, కారుమూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

నరసాపురం టౌన్, ఏప్రిల్ 8: ప్రత్యేకహోదా కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ అభ్యర్థి కానూరి బుజ్జీ అన్నారు. సోమవారం పట్టణంలోని మార్కెట్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ హామీలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించారు. ఆయన వెంట మల్లిపూడి శ్రీనివాస్,గుబ్బల కృష్ణారావు, సాల్మాన్, కె.అమర్, విశ్వేశ్వరరావు, చిన్నా పాల్గొన్నారు.



ఉండి నాయీ బ్రాహ్మణ సంఘం ఎన్నిక

ఉండి, ఏప్రిల్ 8: ఉండి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా మల్లువలస హరికృష్ణ, మల్లువలస హరీష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం అన్నమయ్య భవనంలో నూతన కమిటి ఎన్నికను సంఘం మాజీ అధ్యక్షుడు మల్లువలస అప్పారావు అధ్యక్షతన జరిగింది. గౌరవాధ్యక్షుడుగా మల్లువలస సన్యాసిరావు, గౌరవ సలహాదారులుగా కొడవర్తి సురేష్‌లను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ముత్యాలపల్లి శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా కింతాడ అప్పారావు, కోశాధికారిగా మల్లువలస దుర్గారావు, కార్యవర్గ సభ్యులుగా పొన్నాడ దుర్గాప్రసాదు, కొడవర్తి ప్రసాదు, కింజంగి వీర్రాజు, అలుగోలు కృష్ణ, ముత్యాలపల్లి తాతారావు ఎన్నికయ్యారు.

ఆరోగ్య సిబ్బంది లక్ష్యాలు పూర్తి చేయాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 8 : వైద్య ఆరోగ్య శాఖలో సిబ్బంది తమకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డి.మహేశ్వరరావు అన్నారు. లంకలకోడేరు పీహెచ్‌సీ పరిధిలోని దగ్గులూరు సచివాలయంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపును మహేశ్వరరావు ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఓపీ కార్డుల్లో బీపీ, షుగరు పేషెంట్లు, ఇతర వ్యాధి గ్రస్తులు వివరాలను డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు మాట్లాడుతూ క్రొన్ని పీహెచ్‌సీలలో సాధారణ ప్రసవాలు కన్నా సిజేరియన్ ప్రసవాలు అధికంగా చూపుతున్నారని, అదే విధంగా అబార్షన్లు కూడా ఎక్కువగానే చూపుతున్నారని, దీనివల్ల ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల ద్వారా అందించే సేవలు సక్రమంగా అందడం లేదని నిరూపితమవుతుందన్నారు. వీటిని సరిచేయడానికి పక్కా సర్వే చేసి చూపించాలని సూచించారు. ఆడపిల్లల రేషియో తగ్గిన వారి శాతం పెంచడానికి ప్రతీ సచివాలయం పరిధిలో భేటీ బచావో, భేటి పడావో కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ సెంటర్‌లోనూ, పాఠశాలల్లోనూ విద్యార్థినీలకు, గర్భిణీలకు, బాలింతలకు ఆడపిల్లల ప్రాముఖ్యత గురించి అవగాహన కలిగించాలన్నారు.

సంఘటిత పోరాటం చేయాలి

అత్తిలి, ఏప్రిల్ 8 : భవన నిర్మాణ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సంఘటిత పోరాటానికి సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. సోమసుందర్ పిలుపు నిచ్చారు. సోమవారం ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డాది రామకృష్ణ అధ్యక్షతన జరిగిన అత్తిలి ఏరియా భవన నిర్మాణ కార్మిక సంఘం వార్షికోత్సవ సభలో సోమసుందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

నూతన కార్యవర్గం

అత్తిలి ఏరియా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా ఎస్. పోతురాజు (ఉరదాళ్ళపాలెం), ఉపాధ్యక్షుడిగా సీహెచ్ వెంకటేశ్వర్లు (అత్తిలి), కార్యదర్శిగా వడ్డాది రామకృష్ణ గంగాధరరావు (డి.కుముదవల్లి), సహాయ కార్యదర్శిగా దామిశెట్టి రామకృష్ణ (అత్తిలి), కోశాధికారిగా పువ్వల శ్రీను (ఉరదాళ్ళపాలెం), కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.









ఆచంటలో పితాని ప్రచారం.. భీమవరంలో వాకర్స్‌ను కలిసిన అభ్యర్థులు అంజిబాబు, శ్రీనివాస వర్మ.. మేడపాడులో టీడీపీ కూటమి అభ్యర్థి రామానాయుడు ప్రచారం.. పాలకొల్లులో నిమ్మల సూర్యకుమారి ప్రచారం

బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్: ఎమ్మెల్యే నిమ్మల

యలమంచిలి, ఏప్రిల్ 8: మరో 50 రోజుల్లో అధికారంలోకి వచ్చే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో బీసీలకు 50 సంవత్సరాల వయస్సు వారికే పింఛన్ రూ.4వేలు ఇంటింటికీ వచ్చి అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. మేడపాడు గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఏకష్టం వచ్చినా ఆదుకుని, సేవకుడిగా పనిచేసే తనను మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు. వృద్ధులు, వితంతువులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు పెంచి మీ ఇంటికి వచ్చి అందిస్తామని భరోసా ఇచ్చారు.

ఎమ్మెల్యే కనుసన్నల్లోనే ఇసుక దందా: పితాని

ఆచంట, ఏప్రిల్ 8: నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక దందాకు అవినీతి పరుడు ఎమ్మెల్యే రంగనాథరాజు కారకుడని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం కొడమంచిలిలో మన్నె బాబు నివాసం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో పితాని మాట్లాడుతూ ఇటీవల కరుగోరుమిల్లి ఇసుక ర్యాంప్‌కు పర్మిషన్ వచ్చిందంటూ కొన్ని రోజుల పాటు ఇసుక వ్యాపారం చేశారని, ఈ ర్యాంప్‌కు ఎమ్మెల్యే, తహసీల్దార్, ఎంపీడీవో, సీఐ, ఎస్ఐ స్థానిక అధికారులు సైతం పర్మిషన్ ఉందని అబద్ధాన్ని చెప్పడం జరిగిందన్నారు. తీరా ర్యాంప్‌కు ఎటువంటి పర్మిషన్ లేదంటే ఇసుక దందా ఏ విధంగా జరుగుతుందో తెలుస్తుందన్నారు. ఎమ్మెల్యే కనుసన్నల్లోనే ఇసుక దందా జరిగిందని ఆరోపించారు. ఇలా ఇసుక దందా చేసే కమ్యూనిటీ హాలుకు, గుడికి ఎమ్మెల్యే ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తున్నట్టు ప్రచారం చేసుకుంటున్నాడని విమర్శించారు. సీఎం జగన్ అసమర్థత వల్లే సామాజిక పింఛన్‌లు ఇంటింటికి పంపిణీ చేయలేకపోయారని విమర్శించారు. సమావేశంలో జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి, మన్నె బాబు, చిలుకూరి శ్రీను, జవ్వాది బాలాజీ, సాయిబాబా పాల్గొన్నారు.

వైసీపీని సాగనంపాలి

ఆచంట, ఏప్రిల్ 8: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం కొడమంచిలిలో ఇంటింటా పితాని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ ఈ అవినీతి ప్రభుత్వంలో ప్రజలు అన్ని విధాలా కష్టాలు పడ్డారని రానున్న రోజుల్లో ప్రజల కష్టాలు తొలగి మంచి జరగాలంటే తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

- గత ఎంపీటీసీ ఎన్నికల్లో వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేసిన కందరవల్లికి చెందిన గంధం జనార్దన్ సోమవారం కొడమంచిలిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పితాని సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పితాని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వాకర్స్‌ను కలిసి మద్దతు కోరిన అభ్యర్థులు

భీమవరం టౌన్, ఏప్రిల్ 8 : డీఎన్ఆర్ కాలేజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులను సోమవారం ఉదయం జనసేన అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు), నరసాపురం పార్లమెంట్ బీజేపీ ఉమ్మడి అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ కలసి తమను గెలిపించాలని కోరారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికల, ఆంధ్రప్రదేశ్ సీఫుడ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమాల శ్రీ రామమూర్తి, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవింద రావు, జనసేన పార్టీ స్టేట్ లీగల్ సెల్ కార్యదర్శి ఉండపల్లి రమేష్ నాయుడు, డా క్టర్ వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ విజ్జు రేత్తు రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం రాగానే ఉచితంగా టిడ్కో ఇళ్లు

పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 8: గత టీడీపీ ప్రభుత్వం హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలను టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం రాగానే పేదలు, మహిళలకు ఉచితంగా పంపిణీ జరుగుతుందని పాలకొల్లు ఎమ్మెల్యే రామానాయుడు సతీమణి నిమ్మల సూర్యకుమారి అన్నారు. సోమవారం పాలకొల్లు 10వ వార్డులో కూటమి శ్రేణులతో కలిసి ఆమె ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే టిడ్కోగృహాలను ఉచితంగా అందజేస్తామని ప్రకటించడం పట్ల మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, రాష్ట్ర టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి, గౌరునాయుడు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, నాయకులు బుగ్గే ఆనంద్, బాబూరావు, రవికుమార్, యర్రంశెట్టి దుర్గాభవాని పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ సభను జయప్రదం చేయాలి

తణుకు, ఏప్రిల్ 8: తణుకు నియోజకవర్గంలో ఈ నెల 10న చంద్రబాబు, పవన్ కల్యాణ్ సభను విజయవంతం చేయాలని టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభకు ఏర్పాట్లు, విజయవంతం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కలసికట్టుగా పనిచేయాలని చెప్పారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, ఐతంపూడి శ్రీదేవి, డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, పరిమి వెంకన్నబాబు, బసవా రామకృష్ణ, కలగర వెంకట కృష్ణ, పూర్ణచంద్రరావు, మహేష్, చిక్కాల వేణు, కొమ్మిరెడ్డి శ్రీనివాసు, దాసం ప్రసాదు, ఆకేటి కాశి పాల్గొన్నారు.

బెదరొద్దు నేనున్నా: బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 8: నియోజకవర్గంలో ఓడినా రాష్ట్రంలో గెలిచేది తామేనని అధికార పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు బెదిరిస్తున్నారని పలువురు తన వద్ద వాపోయారని బెదిరింపులకు భయపడవద్దని, తాను అండగా ఉంటానని జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. తాడేపల్లిగూడెంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీజేపీ, జనసేన, టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా జగన్ దుర్మార్గ పాలనకు విసిగి ఆయనను సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు తనకు భరోసాగా నిలవాలన్నారు. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వలవల బాబ్జి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ పాల్గొన్నారు.

వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించాలి

గణపవరం, ఏప్రిల్ 8:వైసీపీని ఓటు ద్వారా చిత్తు చిత్తుగా ఓడించాలని జనసేన ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు సోదరుడు భీమరాజు ఓటర్లను కోరారు. సోమవారం ఏ.గోపవరం గ్రామంలో ఇంటింటా పర్యటించి గ్లాస్ గుర్తుకు ఓటు వేసి ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. టీడీపీ నాయకులు కానుమిల్లి చంటి, ఏడిద వాసు, అల్లూరి బదిరి నారాయణ, భీమవరపు ఏసురాజు, పల్లి వెంకటేశ్వరరావు, జనసేన మండల నాయకుడు తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీ వెన్నెముక బీసీలు



తాడేపల్లిగూడెంలో మూడు పార్టీల నాయకుల ఐక్యత



నరసాపురంలో ప్రచారం చేస్తున్న నాయకర్, పొత్తూరి

తాడేపల్లిగూడెం రూరల్: బీసీలు తెలుగుదేశం పార్టీకి వెన్నెముక అని ఆ పార్టీ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం లింగారాయుడుగూడెంలో సోమవారం రాత్రి బీసీల సదస్సులో నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ నా బీసీలు అంటున్న జగన్ వారికి కేటాయించిన నిధులు పక్కదారి పట్టించి వారికి అన్యాయం చేశారన్నారు. గ్రామంలో మురుగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తా: నాయకర్

నరసాపురం రూరల్, ఏప్రిల్ 8: గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి నియోజకవర్గంలో పెండింగ్ సమస్యల్ని పరిష్కరిస్తానని జనసేన అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. సోమవారం రుస్తుంబాదా గ్రామంలో కూటమి పార్టీలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ హయాంలో నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి కూడా జరగలేదన్నారు. ప్రజలకు సాగు, తాగునీటి కష్టాలు తీర లేదని, అధికారంలోకి వస్తే వీటిని మొదటి ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి పని చేసే పార్టీలైన జనసేన, బీజేపీలకు ఓటు వేయాలన్నారు. కలవకొలను తాతాజీ, జక్కం బాబ్జీ, ఆకన చంద్రశేఖర్, దివి సత్యన్, కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని, బందెల రవీంద్ర, యడ్లపల్లి మహేష్ పాల్గొన్నారు.

కలిసిపూడి, చెరుకువాడల్లో శివ ప్రచారం



శివాలయంలో పూజ చేస్తున్న శివ

ఉండి, ఏప్రిల్ 8: కలిసిపూడిలో స్వతంత్ర అభ్యర్థి శివ రామరాజు శివాలయంలో పూజలు చేసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తదుపరి గోరింతోట, అర్తమూరులో ఆయన ఆటోలో ప్రచారం చేశారు. అక్కడి నుంచి చెరుకువాడలోని ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ గతంలో తనను రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, ఈసారి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, మాజీ జడ్పీటీసీ గేదెల జాన్, ముదుండి వెంకట్రాజు, మాజీ సర్పంచ్ మంతెన రామసీత చంటిరాజు, మోపిదేవి శ్రీను పాల్గొన్నారు.


అల్లు అర్జున్ అభిమానుల పూజలు



పాలకొల్లు టౌన్, ఏప్రిల్ 8: జాతీయ ఉత్తమ నటుడు అల్లు అర్జున్ జన్మ దిన వేడుకలు సోమ వారం స్టేట్ చిరంజీవి యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి తులా రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో అల్లు అర్జున్ అభిమానులు ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకల్లో భాగంగా ఉదయం క్షీరారామలింగేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. స్థానిక ఆపద్బంధు బ్లడ్‌బ్యాంక్‌లో ఉల్లంపర్రు అల్లు అర్జున్ ఆర్మీ సభ్యులు, అభిమానులు రక్తదానం చేశారు. పూలపల్లి వృద్ధాశ్రమంలో కేక్ కటిచేసి, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉల్లంపర్రు అల్లు అర్జున్ ఆర్మీ కుర్మా వాసు, శ్రీను, పీతల కిరణ్, చింతపల్లి సాయిరామ్, చిరంజీవి యువత ఆచంట చరణ్, దీపు, తులా సురేష్ పాల్గొన్నారు.

భీమవరం టౌన్: చిరుపవన్ తేజం సేవా సమితి కార్యాలయంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేశారు. రాష్ట్ర చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు ఉండపల్లి రమేష్ నాయుడు, మెగా ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు చల్లా రాము, కొప్పినీడి బాబీ, యాతం స్వామి, కొప్పర్తి కోటి, చింతా లక్ష్మణ్, మునగాల సంజయ్, రావూరి దుర్గాప్రసాద్, ఇనుకొండ భోగేశ్వరరావు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర అధ్యాపకుడికి డాక్టరేట్



ఉమామహేశ్వరరావును అభినందిస్తున్న పాలకవర్గం

నరసాపురం రూరల్, ఏప్రిల్ 8: మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకులుగా పని చేస్తున్న డాక్టర్ ఉమామహేశ్వరరావుకు డాక్టరేట్ లభించింది. బిగ్ డేటా క్లాసిఫికేషన్ అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు ఆంధ్ర యూనివర్సిటీ ఈ గౌరవం ఇచ్చింది. డాక్టరేట్ తీసుకున్న ఆయన్ను సోమవారం స్వర్ణాంధ్ర కళాశాల చైర్మన్ కె.సత్యనారాయణ, కోశాధికారి త్రినాథ్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్స్ ఎస్.సురేష్‌కుమార్, పందిరీనాథ్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.గోపిచంద్, పి.శ్రీనివాసులు అభినందించారు.

గుండెపోటు- జాగ్రత్తలపై అవగాహన

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 8 : ఎవరికైనా ఆకస్మికంగా గుండెపోటు వస్తే తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్యామ్ వివేక్ విద్యార్థినీలకు అవగాహన కలిగించారు. డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ శ్యామ్ వివేక్ మాట్లాడుతూ గుండెపోటుకు గురైన వారిని సత్వరమే దగ్గరలో ఉన్న వైద్యుని వద్దకు తీసుకువెళ్ళాలి. ముందుగా గాలి తగిలే విధంగా చూడాలి. కంగారు పెట్టకూడదని, తగిన విశ్రాంతి లభించే విధంగా చూడాలని సూచన చేశారు. ఈ సందర్భంగా ప్రదర్శన డెమో నిర్వహించారు. ఈకార్యక్రమంలో జేసీఐ సభ్యులు, ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి, డాక్టర్ మణిమాల, పీవో విజయలక్ష్మి, శ్రీ సంధ్య పాల్గొన్నారు.

15న మండల సమావేశం

నరసాపురం రూరల్, ఏప్రిల్ 8: ఈనెల 15న మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమణరావు తెలిపారు. ఎంపీపీ సోని అధ్యక్షతన ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభమవు తుందన్నారు.

బియ్యం పంపిణీ

ఆచంట, ఏప్రిల్ 8: రాష్ట్రంలో ప్రతీ పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నన్నేటి ఆనందం సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ చైర్మన్ నన్నేటి పుష్ప రాజ్ అన్నారు. రంజాన్ సందర్భంగా ఆచంట వేమవరంలో ముస్లింలకు రావి నాగరాజు ఏర్పాటు చేసిన బియ్యం బస్తాలను పుష్పరాజ్ చేతుల మీదుగా ఆరు కుటుంబాల వారికి అందజేశారు.

ఐదు శాతం పన్ను రాయితీ

భీమవరం టౌన్, ఏప్రిల్ 8 : పట్టణంలోని యజమానులు 2024- 25 ఏడాది ముందస్తు పన్ను చెల్లింపుపై 5శాతం రాయితీ ఇస్తూ సోమవారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 30లోపు మొత్తం పన్ను ఒకేసారి చెల్లించిన వారికి 5 శాతం పన్ను రాయితీ వర్తింస్తుంది. పన్ను చెల్లింపులు పురపాలక సంఘ కార్యాలయంలోని కౌంటర్‌లోగానీ సచివాలయం వద్ద గాని, ఆన్‌లైన్‌లో సీడీఎంఏపీ. జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా గాని చెల్లించవచ్చునని కమిషనర్ ఎం.శ్యామల తెలిపారు.

భీమలాపురంలో ఉపాధి పనుల గుర్తింపు



భీమలాపురంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ ప్రభాకర్

ఆచంట, ఏప్రిల్ 8: జిల్లాలో పూడికతీత పనులు కాకుండా ఇతర పనుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా డ్వామా పీడీ ఎం. ప్రభాకర్ భీమలాపురంలో సోమవారం క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఉపాధి వేతనదారులతో ముఖా ముఖి కార్యక్రమం నిర్వహించి రోజూ వారి వేతనం రూ.300 పొందేలా కొలతలు ప్రకారం పనులు చేపట్టాలని అన్నారు. వేసవి కాలం రీత్యా ఎండ తీవ్ర ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అందరూ మంచినీరు తెచ్చుకోవాలని సూచి ంచారు. పని ప్రదేశాల్లో ప్రథమ చికిత్స, నీడ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి 13 ఎకరాల్లో జామ తోట పెంపకంలో రైతులకు వ్యక్తిగత నీటి గుంటలు, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడం వంటి పనులపై అవగాహన కల్పించి పనులు గుర్తించారు. ఈ కార్యక్రమంలో తణుకు క్లస్టర్ ఏపీడీఎం సురేష్‌బాబు, ఎంపీడీవో పి.నరసింహ ప్రసాద్, శ్రీకాంత్, శ్రీనివాస్, వర్మ, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారంతో డిజిటల్ గది నిర్మాణం

మొగల్తూరు, ఏప్రిల్ 8: పేరుపాలెం సౌత్ గ్రామంలోని చల్లావారిమెరకలో దాత ఆర్థిక సహకారంతో ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ తరగతి గది నిర్మాణం చేపట్టారు. సోమవారం దాత సోదరుడు లక్ష్మణ్ కుమార్ మొగల్తూరులో విలేకరులతో మాట్లాడారు. తమ సోదరుడు చల్లా బెనర్జీ ఇదే పాఠశాలలో ఐదవ తరగతి వరకు విద్యనభ్యసించి ప్రస్తుతం హైదరాబాద్‌లోని నార్త్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ ఇండియా అనే కంపెనీలో ఉన్నత స్థితిలో ఉన్నాడన్నారు. గ్రామంలోని పాఠశాలలో డిజిటల్ రూమ్ ఏర్పాటు విషయమై కంపెనీ దృష్టికి తీసుకువెళ్లడంతో కంపెనీ యాజమాన్యం స్పందించి రూ.11.61 లక్షలు సహాయం అందించిందన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ గ్రామోత్సవం

పెంటపాడు, ఏప్రిల్ 8: ఉగాదిని పురస్కరించుకుని పెంటపాడు ముత్యాలమ్మ వారికి సోమవారం గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. శక్తి వేషాలు, తీన్‌మార్ వాయిద్యాలు, గరగ నృత్యాలు, విచిత్రవేషధారణల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో అమ్మవారిని ఊరేగించారు. మహిళలు అమ్మవారి పల్లకి కింద నీళ్ల వారబోసేందుకు పోటీపడ్డారు.

చలివేంద్రాల ఏర్పాటు భేష్

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 8: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్ అన్నారు. నడిపూడి పెద్దిరాజు జ్ఞాపకార్థం ఆయన సోదరుడు నడిపూడి ఉమా పట్టణంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం శ్రీధర్ ప్రారంభించారు. నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఉమా తెలిపారు.

కేటాయించిన ప్రాంతాల్లో బ్యానర్లు ఉండాలి: ఆర్డీవో

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 8: పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్‌లు ఎన్నికల సంఘం కేటాయించిన ప్రాంతాల్లోనే ఏర్పాటు చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో చెన్నయ్య సూచించారు. తాడేపల్లిగూడెంలోని తన కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ప్రైవేటు ప్లేసుల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలంటే 48 గంటల ముందే తమకు దరఖాస్తు చేసుకోవాలని, వివాదాలు లేని ప్రాంతాల్లోనే అనుమతిస్తారని స్పష్టం చేశారు. గుడి, బడి, పంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాల వద్ద బ్యానర్ల ఏర్పాటు నిషేధమన్నారు. నామినేషన్లు ప్రారంభమైన నాటి నుంచి బ్యానర్లు, ఫ్లెక్సీలు, కరపత్రాలు అభ్యర్థుల పేరున నమోదు చేస్తారన్నారు. అప్పటి వరకూ ఆ ఖర్చు పార్టీల ఖాతాలో ఉంటుందన్నారు.

- ఏఆర్వో పి. మురళీకృష్ణ ఆధ్వర్యంలో వీఆర్వోలు, కార్యదర్శులు, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహణ, మద్యం అక్రమ నిల్వలు, గిఫ్టుల పంపిణీ వంటివి ఉంటే చర్యలు తీసుకుంటామని గ్రామ స్థాయిలో అన్ని పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించాలని సూచించారు. ఎంపీడీవో శర్మ, ఎస్సై సురేష్ పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించిన మహిళలు, గ్రామస్తులు

బొండాడ గ్రామంలో రోడ్డుపై బైఠాయింపు

కాళ్ల, ఏప్రిల్ 8 : బొండాడ గ్రామంలో ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌ని తొలగించాలంటూ ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అడ్డంగా టెంట్ వేసి నేలపై బైఠాయించి గ్రామస్తులు, మహిళలు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు, గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా ప్రధాన రహదారిని ఆనుకుని నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్న తమ ఇళ్ళను రహదారుల మరమ్మతుల పేరిట బలవంతంగా కూల్చే ప్రయత్నం చెయ్యటం దుర్మార్గమని వాపోయారు. కనీసం ఏ విధమైన ముందస్తు నోటీసు కూడా ఇవ్వలేదన్నారు. టోల్‌గేట్ నిర్వహిస్తున్న వ్యక్తి దగ్గరుండి తమ నివాసాలను తొలగించేందుకు ప్రయత్నం చేయటానికి అతనికి ఏ అర్హత ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న టోల్‌గేట్‌ను తొలగించాలని నినాదాలు చేశారు. పోలీసులు రంగప్రవేశం చేశారు. గ్రామ సర్పంచ్ మన్నే నాగరాజు ఆందోళనకారులతో చర్చలు జరిపి బుధవారం నాటికి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు నిరసనను విరమించారు.

క్రైస్తవులపై వేధింపులకు నిరసనగా ధర్నా

భీమవరం టౌన్, ఏప్రిల్ 8 : ఇటీవల భీమవరం పరిసర ప్రాంతాల్లో క్రైస్తవులపై మతోన్మాదులు వేధింపులకు గురి చేస్తున్నారని, అటువంటి వ్యక్తులపై తగు చర్యలు తీసుకోవాలని బహుజన జేఏసీ, దళిత ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో భీమవరం టౌన్ హాల్ రోడ్డులో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కోనా జోసెఫ్, దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్, దిగుపాటి రాజ్ గోపాల్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో కవ్వింపు చర్యలు చేస్తున్నారని, కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారని, ఇటువంటి వారిని గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ లక్కీడిప్ విజేతలకు బహుమతులు

భీమవరం టౌన్, ఏప్రిల్ 8 : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సుఖవంతమైనదని ఆర్టీసీ డిపో మేనేజర్ వీఎం సత్యనారాయణమూర్తి అన్నారు. ఆదాయం తక్కువగా ఉన్న రూట్‌ల్లో బస్సుల ప్రయాణికులను ఆకర్షించేందుకు ఏర్పాటు చేసిన లక్కీడిప్ కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం బస్ కాంప్లెక్స్‌లో విజేతలను ఎంపిక చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం నుంచి ఏలూరు, జంగారెడ్డిగూడెం, నరసాపురం (మత్స్యపురి), తాడేపల్లిగూడెం (గణపవరం)రూట్‌లలో బస్సుల్లోని గిఫ్ట్ బాక్సుల్లో ప్రయాణికులు వేసిన టికెట్లను డ్రా తీసి లక్కీడిప్ ద్వారా ఒక్కొక్క రూట్ నుంచి ఇద్దరు చొప్పున విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందించారు. విజేతలకు సీఎంఆర్ షాపింగ్ మాల్ భీమవరం, షానూర్ వాచ్ షోరూం బహుమతులు సమకూర్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సాయుధ బలగాల కవాతు

యలమంచిలి, ఏప్రిల్ 8: ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ కె.శివన్నారాయణ అన్నారు. మే నెలలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మండలంలోని ఏనుగువానిలంక, బాడవ, కలగంపూడి, యలమంచిలి, ఆర్యపేట గ్రామాల్లో సోమవారం భద్రతా దళాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివన్నారాయణ మాట్లాడుతూ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా, శాంతిభద్రతలను కాపాడేందుకు, ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు.

అకౌంటింగ్ కోర్సులతో అవకాశాలు



మాట్లాడుతున్న సీఏ శ్రీనివాసరావు

తణుకు, ఏప్రిల్ 8: డిగ్రీలో బీకాం చదివిన విద్యార్థినులకు అకౌంటింగ్ కోర్సులలో గొప్ప అవకాశాలు ఉంటాయని బ్రహ్మయ్య అండ్ కో చార్టర్డ్ అకౌంటెంట్ చెరుకూరి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఎస్కేఎస్డీ మహిళా కళాశాలలో నిర్వహించిన ఆదాయ పన్నుపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ బీకాం విద్యార్థులకు కంపెనీ సెక్రటరీ, చార్టెడ్ అకౌంటింగ్, సి.ఎం.ఎ. వంటి కోర్సులకు అవకాశాలు ఉంటాయన్నారు. ఏ రాష్ట్రం ఎంత శాతం ఆదాయ పన్ను కేంద్రానికి కడుతుందో తిరిగి రాష్ట్రానికి ఎంత శాతం ఇస్తుందో అవగాహన కల్పించారు. కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి, ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ యు.ఎల్. సుందరీబాయ్ పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

లోగ్రేడ్ పొగాకుకు మంచి ధర

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 8 : వర్జీనియా పరిధిలో లోగ్రేడ్ పొగాకుకు మంచి ధరలు వస్తున్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ తెలిపారు. సోమవారం జంగారెడ్డిగూడెం వేలం కేంద్రంలో జరిగిన బోర్డు అధికారులు, రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం లోగ్రేడ్ పొగాకుకు మంచి ధర పలుకుతోందని, నెంబరు పొగాకుకు ధర పెరిగితే లోగ్రేడ్ ధర తగ్గిపోయే ప్రమాదం ఉందని దీనిని గమనించి రైతులందరూ మార్కెట్‌లో ధర పలికే బేళ్లను ప్రతీ రోజు1000కి తగ్గకుండా అమ్ముకోవాలని సూచించారు. సైక్లోన్ వల్ల తోటలు దెబ్బతిని ఎక్కువగా లోగ్రేడ్ వచ్చిందని, ఉన్న కొద్దిపాటి నంబర్ పొగాకుకు కేజీకి రూ.300 కనీసం రాకపోతే భారీగా నష్టపో తామని, సైక్లోన్ కారణంగా దిగుబడులు ఎకరాకు 3-4 క్వింటాలు తగ్గిపోయిందని మంచి ధరలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబు, రీజనల్ మేనజర్ ఆదిశేషయ్య, రైతు నాయకులు గద్దే లక్ష్మణరావు, గద్దే రాజేంద్ర ప్రసాద్, వామిశెట్టి హరిబాబు, ఘంటసాల గాంధీ, సత్రం వెంకటరావు, అట్లూరి సతీష్, గడ్డమనుగు సత్యనారాయణ, పిన్నమనేని రాధాకృష్ణ పాల్గొన్నారు. కొయ్యలగూడెం పొగాకు వేలం కేంద్రాన్ని యశ్వంత్‌కుమార్ పరిశీలించారు. వేలాన్ని పరిశీలించి రైతులకు, అధికారులకు తగు సూచనలు చేశారు.

విర్డ్ ఆసుపత్రిలో చారిటబుల్ ఆర్థోపెడిక్ క్యాంపు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 8: విర్డ్ ఆసుపత్రిలో ఈనెల 21 నుంచి 24 వరకూ డాక్టర్ శ్రీనాథ్ కామినేని (యుఎస్‌ఏ) వారిచే చారిటబుల్ ఆర్థోపెడిక్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్‌వీ సుధాకరావు తెలిపారు. భుజం, మోచేయి, తుంటి,మోకాలు సమస్యలున్నవారికి అత్యాధునిక వైద్యం అందించేందుకు యుఎస్‌ఏ నుంచి కూడా వైద్యులు శస్త్ర చికిత్సలు చేసేందుకు వస్తారని వివరించారు.వైద్య ఖర్చులు భరించలేని వారికి స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలతో భాగస్వామ్యులుగా కలిసి పనిచేస్తున్నాయన్నారు. సమస్యలున్న వారు స్క్రీనింగ్, చికిత్స కోసం పాత రిపోర్ట్స్ తెచ్చి రిజిస్టర్ చేయించుకోవాన్నారు. 83744 45108 నంబరును సంప్రదించాలని కోరారు.

రియల్‌టైం సాఫ్ట్‌వేర్‌ల అభివృద్ధికి కృషి చేయాలి



అనీల్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఆచార్యులు

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 8 : విద్యార్థులు రియల్ టైం సాఫ్ట్‌వేర్‌ల అభివృద్ధి కోసం కృషి చేయాలని భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ జీ.అనీల్‌కుమార్ సూచించారు. ఏపీ నిట్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం సహకారంతో మాట్లాబ్-సిమ్యులింక్ అనే అంశంపై విద్యార్థులకు సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనీల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు నాణ్యమైన, ఉన్నతమైన ఆలోచనలు చేస్తూ విభిన్న పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. మాట్లాబ్-సిమ్యులింక్ బేసిక్స్, పనిచేసే విధానం, ఎలా నిర్మించాలి తదితర అంశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం అనీల్‌కుమార్‌ను శాలువా, జ్ఞాపికలతో ఆచార్యులు, విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమానికి కన్వీనర్‌గా డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ వీరేష్‌కుమార్ వ్యవహరించగా, రీసెర్చ్ కన్సల్టెన్సీ డీన్ డాక్టర్ జీఆర్‌కే శాస్త్రి, విభాగాధిపతి డాక్టర్ బాబూరావు, ఆచార్యులు డాక్టర్ సందీప్, డాక్టర్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఏలూరు స్పోర్ట్స్, ఏప్రిల్ 8: పాండిచ్చేరిలో ఈనెల 9వ తేదీనుంచి 15వ తేదీ వరకు జరిగే జాతీయ యూత్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా క్రీడా కారులను ఎంపిక చేసినట్లు బాస్కెట్ బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు కె.కృష్ణారెడ్డి, జి.శ్రీనివాసరావు తెలిపారు. ఈశ్వర్ తేజ, ఎస్.కిషోర్, ఎన్.సందీప్‌కుమార్, రుత్వికలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ట్రెజరర్ కె.మురళీకృష్ణ తెలిపారు.

239 ఆర్బీకేల్లో ధాన్యం కొనుగోళ్లు : జేసీ

ఏలూరు సిటీ, ఏప్రిల్ 8 : రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం సేకరణకు జిల్లాలో 239 రైతు భరోసా కేంద్రాలు గుర్తించామని ఈ నెల 6 వ తేదీ నుంచే కొనుగోళ్ల ప్రారంభించామని జేసీ లావణ్యవేణి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో 80 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా 3.12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కాగలదని అంచనా. రైతు భరోసా కేంద్రాల ద్వారా ముందుగా 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి 77 లక్షల గోనె సంచులు అవసరం అవుతాయని అంచనా వేశామని, 40 లక్షలు గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం రబీ సీజన్‌కు పండిన ధాన్యానికి గ్రేడ్ - ఏ రకానికి క్వింటాలుకు రూ. 2,203, సాధారణ రకానికి క్వింటాలుకు రూ.2,183 కనీస మద్దతు ధర నిర్ణయించారు. రైతు సొంతంగా వాహనం, లేబరు ఖర్చు, గోనె సంచులు ఉపయోగించుకుంటే రైతుకు నేరుగా సొమ్ములు చెల్లిస్తాం. ధాన్యం సేకరణ కేంద్రాలతో ఇప్పటి వరకు 98 రైస్ మిల్లులను అనుసంధానం చేశామన్నారు. సమా వేశంలో సివిల్ సప్లయీస్ డీఎం మంజుభార్గవి పాల్గొన్నారు. ఉంగుటూరు-1 సచివాలయంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో సోమవారం నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభించినట్టు ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. ఏలూరు డివిజన్‌లోని ఏడు మండలాల్లో రబీలో 57,900 ఎకరాల్లో రబీ వరి సాగు చేస్తుండగా ప్రస్తుతం 3,212 ఎకరాలకు సంబంధించి వరి కోతలు పూర్తయ్యాయన్నారు. డివిజన్‌లోని అన్ని మండలాల్లో ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని తహసీల్దార్లను ఆదేశించామన్నారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ, తహసీల్దార్ కె.వెంకట శివయ్య వ్యవసాయ పాల్గొన్నారు.

ఐదేళ్లల్లో నియోజకవర్గానికి రూ.కోటి ఇచ్చారు

అభివృద్ధి ఎలా జరుగుతుంది : ఎలీజా



జంగారెడ్డిగూడెం,ఏప్రిల్ 8 : ఐదేళ్ల వైసీపీ పాలనలో చింతలపూడి నియోజకవర్గం అభివృద్ధికి కేవలం రూ.1కోటి మాత్రం ఇచ్చారు. ఇక అభివృద్ధి ఎలా సాధ్య పడుతుంది. పంచాయతీల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కాంగ్రె సుతోనే ప్రత్యేక హోదాతో పాటు అభివృద్ధి సాధ్యమవుతందని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. వైసీపీని వీడి కాంగ్రెసులో చేరిన తరువాత ఆయన సోమవారం జంగారెడ్డిగూడెం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నిధులు లేక ఐదేళ్లల్లో ఎటువంటి అభివృద్ధి సాధించలేక పోయామన్నారు. గ్రామ పర్యటనల సమయంలో ప్రజలు ఎన్నో సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చేవారని కానీ వాటిని పరిష్కరించే మార్గాలు లేకపోయాయన్నారు. నాయకులు సీహెచ్‌ఆర్, ఎం.ప్రసాద్‌లు ఉన్నారు.

8-04-2024 పొగాకు ధరలు (రూ.)



పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	242	225	234.42
జంగారెడ్డిగూడెం-1	242	235	240.10
జంగారెడ్డిగూడెం-2	242	235	239.68
కొయ్యలగూడెం	243	235	240.01
గోపాలపురం	242	235	239.52

తెలుగువారి తొలిపండుగ

ఉగాది..



ఏలూరులో మార్కెట్ నుంచి ఉగాదికి అవసరమైన సరుకులు తీసుకువెళుతున్న మహిళలు

విరబూసిన వేపపువ్వు, మావిచిగురు, కోకిలమ్మ గానం వసంతకాలం ఆగమనానికి చిహ్నాలు. ఉగాది తెలుగువారి తొలిపండుగ. ఈ రోజు నుంచి శ్రీక్రోధి నామ సంవత్సవం పేరుతో తెలుగు నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. హిందువులకు అత్యంత శ్రేష్టమైన ఉగాదిని తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా కేరళ, పంజాబ్, బెంగాల్, మహారాష్ట్ర, అసోం రాష్ట్రాల్లో కూడా జరుపు కుంటారు.కష్టసుఖాలను సానుకూలంగా స్వీకరించాలన్నదే ఉగాది పచ్చడిలోని ఆంతర్యం. ఈ రోజున కొత్తబట్టలు, పిండివంటలు, బంధుమిత్రుల కోలాహలం మధ్య కుటుంబాలు కళకళలాడుతాయి.

పోలవరం/ ద్వారకాతిరుమల/ ఏలూరు సిటీ/ పాలకొల్లు అర్బన్



ఈ రోజున ఏం చేయాలంటే..

ఉగాది రోజున తెల్లవారుజామునే నిద్రలేచి తలంటు స్నానం చేసి కొత్త బట్టలు ధరిస్తారు. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి వసంతలక్ష్మిని ఆహ్వానిస్తారు. ఉగాది రోజున షడ్రచులతో చేసే వేప పువ్వు పచ్చడి జీవితంలో ఎదురయ్యే వివిధ అనుభవాలను స్ఫురిస్తుంది. బెల్లం తీపి ఆనందానికి సంతోషానికి ప్రతీక కాగా ఉప్పు ఉత్సాహానికి రుచికి సంకేతం. వేప పువ్వులోని చేదు బాధలకు, చింతపండు పులుపు నేర్పుగా వ్యవహరించే పరిస్థితులకు, పచ్చి మామిడి ముక్కల వగరు కొత్త సవాళ్ళకు, కారం సహనానికి ప్రతీకగా చెబుతారు. ఉగాది పచ్చడి స్వీకరించిన సందర్భంలో ఏ రుచి ముందుగా స్ఫురిస్తుందో ఆ రుచిని బట్టి వారి జీవితంలో ఎదురయ్యే అనుభవాలు ఉంటాయని చెబుతారు.ఈ ఉగాది పచ్చడి వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. తెలుగువారు ఉగాది రోజున పంచాంగ శ్రవణం చేయడం ఆచారంగా వస్తుంది. పంచాంగ శ్రవణం వల్ల సంపద, ఆయుస్సు , పాప ప్రక్షాళన, వ్యాధి నివారణ, గంగా స్నాన శుభ ఫలితాలనిస్తాయని నమ్ముతారు. ఉగాది రోజున కవి సమ్మేళనాలు నిర్వహిస్తారు.ఉగాదికి పురాణ ఇతిహాసంలో మరో కథనముంది. భాగవతంలో ధర్మం గతి తప్పి నప్పుడు అవతరిస్తానని విష్ణువు చెప్పిన విధంగా విశ్వాన్ని సృష్టించిన బ్రహ్మ నిద్రించిన సందర్భంలో సోమకాసురుడు వేదాలను తస్కరించి పారిపోతాడు. మహాప్రళయం వల్ల జలమయమై నీటి అడుగున ఉన్న సోమకాసురుడి వద్దకు మత్స్యావతారంలో వెళ్లి సోమకాసురుడిని సంహరించి వేదాలను బ్రహ్మ వద్దకు తీసుకొస్తాడు విష్ణువు. బహ్మ మళ్లీ సృష్టి కొనసాగించడానికి ప్రతీకగా యుగాదిని జరుపుకుంటారు.

ఫలితాలు అంతంత మాత్రమే..

క్రోధి నామసంవత్సర ఫలితాలు సాదాసీదాగానే ఉంటాయి తొలి దశలో కొంత ఒడిదుడుకులు ఉంటాయి. పేరులోనే కొంచెం ఉగ్రం కనిపిస్తోంది.అందుకే ఈ ఏడాది ప్రారంభంలో కొంత ఆవేశాలతో ప్రారంభమైనా తరువాత సామాన్యంగా సాగుతుంది. ఆహార ధాన్యాల ధరలు పెరుగుతాయి. వ్యాపారస్తులకు కొంత ఒడిదుడుకులు తప్పవు చైత్ర, వైశాఖ మాసాల్లో వడగండ్ల వానలు కురుస్తాయి. ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండటంతో అగ్ని భయాలుంటాయి. జేష్ఠ మాసంలో ధాన్యం ధరలు పెరుగుతాయి. మే 1వతేదీ నుంచి జూలై 7 వతేదీ వరకు శుక్రమౌఢ్యమి, మే 5వతేదీ నుంచి జూన్ 1 వతేదీ వరకు గురు మౌఢ్యమి ఉంటుంది. మే 1వ తేదీ నుంచి ఆగస్టు 5 వరకు శుభ ముహూర్తాలు లేవు. ఈ సంవత్సరంలో గ్రహణాలు అసలు లేవు. జూన్ 11 వతేదీ నుంచి తొలకరి వర్షాలు ప్రారంభం అవుతాయి.

-పంచాంగ కర్తలు కాశీభొట్ల ప్రసాద్ శాస్త్రి, పార్వతీశ్వర శర్మ

కోర్కె లీడేరుచుండు క్రోధి నందు..

కోపతాపాల వలయమ్ము కోరు కోక
ప్రకృతి ఒడిలోన చల్లగ పవ్వళించు
కోర్కెలెన్నియో కలలను కూర్చుచుండ
కొలను తామరై క్రోధియే యిలకు వచ్చె

నింగి నేలలు రంగుల పొంగుదాల్చి
రంగ వల్లుల వేదికై రహిని గూర్చ
కూసె కోయిల చిగురులు కొరికి కొరికి
కాసె వృక్షాలు ఫలముల కలిమి నంది

ఆరు ఋతువులామని దాల్చు సంబరములు
సాగు జీవన యాత్రలో సంబరములు
వెలుగు నీడలు విరిసెడివి ద్రుమములు
అరయ ప్రకృతి సొబగులెల్ల అద్భుతములు

కోర్కెలుదయించ కూసెను కోయిలమ్మ
కుసుమ సౌగంధ్య మలమెను కొమ్మకొమ్మ
ఆరు రుచుల నందించెనీ ఆమనమ్మ
చైత్ర శోభలు చూపెడి చిత్రమమ్మ

షష్టి వర్షములివె సృష్టియారంభమున్
దెల్పుయుగాదులై తేజ మొల్కు
కాల సరోవర హేలా విలాసాలు
కన్పింప జేయుచు కదలు చుండ
మోహ మంత్రమ్ముల మహత్వ ప్రభలలో
జీవ జాలమ్ములు చిక్కు చుండ
అరయ నుగాదులు అలవోలె కలవోలె
యిలనేల వచ్చెను నలలితముగ

క్రోధి వత్సర మిది నేడు కొలువు తీరె
లోక బాధలు క్రోధమున్ లుప్తమవ్వ
క్రొత్తదనములు చల్లిన విత్తు లవ్వ
కోర్కె లీడేరు చుండును.

డాక్టర్ పసుపులేటి రామచంద్రరావు, తెలుగు పండితులు, జడ్పీ హైస్కూల్, కేశవరం,టి. నరసాపురం మండలం

చిన వెంకన్నకూ తొలి ఉత్సవమే..



ద్వారకా తిరుమల చినవెంకన్న క్షేత్రంలో ఉగాది పండుగకు ప్రత్యేక స్థానం ఉంది. ఉగాది ఉత్సవాలను ఉగాది మండపంలో ప్రతిఏటా కన్నుల పండువగా జరుపుతారు. ఆలయాన్ని పరిసరాలను శోభాయమానంగా అలంకరించారు. వెండి శేషవాహనంపై ఉభయదేవేరులతో కొలువుతీరిన శ్రీవారు అట్టహాసంగా ఉగాది మండపం వద్దకు వచ్చి అక్కడి ప్రత్యేక వేదికపై కొలువుదీరుతారు. అర్చకులు, పండితులు పంచాంగ శ్రవణం చేస్తారు.

తైలాభ్యంగానికి ప్రత్యామ్నాయంగా ప్రోక్షణ



పంచకృత్య నిర్వహణలో మొదటిదైన తైలాభ్యంగానికి ప్రత్యామ్నాయంగా ఉగాది నాడు ప్రోక్షణ నిర్వహిస్తారు.నూతన సంవత్సర స్తోత్రం, నింబకుసుమ భక్షణం (ఉగాది పచ్చడి సేవనం), పూర్ణకుంభ దానం, పంచాంగ శ్రవణం, జరుగుతాయి. పండిత సత్కారం, సాంస్కృతిక కార్యక్రమాలతో శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది ఉత్సవం పూర్తవుతుంది.

-జగన్నాథాచార్యులు, ప్రధానార్చకులు

ఇక వెనక్కి వెళ్ళండి !

ఉమ్మడి జిల్లాలో 32 మంది వైద్య ఉద్యోగుల డిప్యూటేషన్లు రద్దు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 8 : పని సర్దుబాటు(వర్క్ అడ్జస్ట్‌మెంట్) పేరుతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా ఏళ్ళ తరబడి ఆయా ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బందిని తక్షణమే వారివారి పాతస్థానాలకు పంపాలని వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు జారీచేసిన ఆదేశాలు సోమవారం ఒక్కసారిగా కలకలం రేపాయి. ఆయన ఆదేశాలతో ఉమ్మడి జిల్లాలో ఆయా కేడర్లలో డిప్యూటేషన్లు/వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై పనిచేస్తున్న మొత్తం 32మందిని రిలీవ్‌చేసి పాతస్థానాల్లో ఉదయం 11 గంటలకే రిపోర్ట్ చేసేలా జిల్లావైద్య ఆరోగ్యశాఖ చర్యలు తీసుకుంది. ఆదివారం సాయంత్రం జిల్లాకు అందిన ఆదేశాలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయడానికి కలెక్టర్ అనుమతి తీసుకుని, ఆ వెంటనే సంబంధిత సిబ్బంది పాతస్థానాల్లో విధులు చేపట్టడానికి చర్యలు తీసుకోవడం చకచకా జరిగిపోయాయి. తాత్కాలిక ప్రాతిపదికన చేపట్టిన డిప్యూటేషన్లు అయినందున సంబంధిత సిబ్బంది తిరిగి పాత స్థానాల్లో చేరడానికి సాంకేతికంగా ఎన్నికల కోడ్ అడ్డంకి కాబోదని డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఇలా ఉమ్మడి జిల్లాలో డిప్యూటేషన్లు రద్దయినవారిలో వైద్యాధికారులు ముగ్గురు, సీనియర్ /జూనియర్ అసిస్టెంట్లు 9, ఫార్మసిస్టులు 2, హెల్త్ ఎడ్యుకేటర్ 1, ఎంపీ హెచ్‌వోలు 3, ఎంపీహెచ్ఎస్ (ఫిమేల్) 2, ఎంఎన్‌వోలు, ఎఫ్ఎన్‌వోలు,స్వీపర్లు తదితర క్లాస్-4 సిబ్బంది 10 మంది ఉన్నారు. చాలాకాలంగా వర్క్ అడ్జస్ట్‌మెంట్లు/ డిప్యూటేషన్లపై వివాదాలు ముసురుకున్న విషయం తెలిసిందే. పలువురు ప్రజాప్రతినిదులు, ఆరోగ్యశాఖ రాష్ట్ర కార్యాలయంలో పైరవీలతో కొందరు ఉద్యోగులు తమకు అనుకూలమైన స్థానాలకు డిప్యూటేషన్లు వేయించుకోవడం, ఫలితంగా వారు పనిచేయాల్సిన వాస్తవస్థానాల్లో ఆయా విధులు నిర్వర్తించడానికి సిబ్బంది కొరత ఏర్పడటం జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో దూరప్రాంతమండలాలు, ఏజెన్సీ మండలాల నుంచి సైతం ఏలూరు, పరిసర మండలాలకు డిప్యూటేషన్లు వేయించుకుని ఏళ్ళతరబడి పాతుకుపోవడం జరుగుతోంది. ఇలా వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై తమకు నచ్చిన స్థానాల్లో పనిచేస్తున్న వారిలో కొందరు ఉద్యోగసంఘాల నాయకులు కూడా ఉండటం గమనార్హం. ఉద్యోగ నియామావళిపై రూపొందించిన సీసీఏ రూల్స్‌ప్రకారం జీతం తీసుకున్నచోటే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఏదైనా ప్రత్యేక పరిస్థితుల్లో తొలుత కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి అనుమతి తీసుకున్న తర్వాత వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపి అప్రూవల్ వచ్చిన అనంతరమే డీఎంహెచ్‌వో ఉత్తర్వులు ఇస్తారు. దీనికి భిన్నంగా గతంలో పైరవీలతో డిప్యూటేషన్లు తెచ్చుకోవడం, ఆర్థికంగా లాభదాయకంగా వున్న సీట్లలో ఏళ్ళతరబడి తిష్టవేయడం పరిపాటిగా తయారైంది. ఈ సమస్య వైద్య ఆరోగ్యశాఖలో పలు కీలక కార్యక్రమాలు, పథకాల అమలుకు సిబ్బంది కొరతతో ఆటంకంగా మారడంతో డిప్యూటేషన్‌లన్నింటినీ రద్దుచేయాలన్న నిర్ణయానికి రావడంతో ఇక కదలికలు తప్పలేదు. కాగా ఒక్కసారిగా డిప్యూటేషన్లన్నింటినీ రద్దుచేయడంతో కీలకమైన విభాగాల్లో సిబ్బంది కొరత తప్పదని భావిస్తున్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ధర్నా



నూజివీడు టౌన్, ఏప్రిల్ 8: క్యాంపస్ విడిచివెళ్ళాలంటూ ఆర్జీయూకేటీ యాజమాన్యం ఆదేశాల్వివడంతో విద్యార్థులు ధర్నాకు దిగారు.నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఇంజనీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులు తమ అకాడమీ క్యాలెండర్ పూర్తయిన నేపథ్యంలో క్యాంపస్‌ను విడిచివెళ్ళాలని క్యాంపస్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దాదాపు వెయ్యి మంది విద్యార్థులకు మెసేజ్‌లను పంపింది. అయితే ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ప్రాజెక్టు, రివ్యూస్‌ను పూర్తి చేయాల్సి ఉంది. వీటి సమర్పణకు ఏప్రిల్ 10వ తేదీ చివరి రోజుగా క్యాంపస్ అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టులు సమర్పించేందుకు ప్రస్తుతం ఇచ్చిన ఆదేశాలు తమకు ప్రతిబంధక మని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఆర్జీయూకేటీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టెక్ జెట్ వంటి టెక్‌ఫెస్టులు కూడా పూర్తికావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆర్జీయూకేటీ పరిధిలోని ఒంగోలు, శ్రీకాకుళం, ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లలో అకడమిక్ క్యాలెండర్ ఏప్రిల్ 25 వరకు అమలు చేస్తుండగా ఇక్కడ ఏప్రిల్ 8వ తేదీ చివరిరోజుగా పేర్కొంటూ క్యాంపస్‌ను విడిచి వెళ్ళాలని ఆదేశాలు జారీ చేయడంపై విద్యార్థులు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆఫీస్ బ్లాక్ వద్ద సోమవారం రాత్రి 9 గంటల వరకు నిరసన తెలిపారు. అభ్యంతరాలపై యాజమాన్యం దృష్టికి తీసుకు వెళతామని విద్యార్థులకు నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు.

క్రైం కార్నర్

160 లీటర్ల సారా స్వాధీనం



చింతలపూడి/ జీలుగుమిల్లి, ఏప్రిల్ 8:చింతలపూడి ఎస్ఈబీ సర్కిల్ పరిధిలో ఎస్ఈబీ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ గణపతి బాబు ఆధ్వర్యంలో సారాపై దాడులు జరిపి 3,800 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేశారు. 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సర్కిల్లోని నాగిరెడ్డిగూడెం, పశ్చిమయడవల్లి, కృష్ణాపురం గ్రామాల్లో దాడులు చేసి బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ముగ్గురి పై కేసు నమోదు చేసినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. ఏలూరు డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు, ఎస్సై మోహన్‌రావు పాల్గొన్నారు. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో పొలాల వద్ద సారా తయారు చేస్తున్న కొప్పుల శ్రీను అరెస్టు చేశారు. 100 లీటర్ల సారా, బైక్ సీజ్ చేశారు. 2400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

భీమడోలు, ఏప్రిల్ 8 : భీమడోలు మండలం కురెళ్ళగూడెం జాతీయ రహదారిపై మోటారు సైకిల్‌పై వెళ్తున్న దుర్గాసాయిని మినీ కంటైనర్ లారీ ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు.ఏలూరు తూర్పు వీధికి చెందిన మల్లా దుర్గాసాయి (25) సోమవారం ఉదయం 11 గంటలకు బయటకు వెళ్తున్నానని చెప్పి మోటారు సైకిల్‌పై వెళ్ళాడు. కురెళ్ళగూడెం సమీపంలోని లారీ మోటారు సైకిల్‌ను ఢీకొట్టడంత అక్కడికక్కడే మృతి చెందాడు. భీమడోలు ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేశారు.


పామాయిల్ గెలలు కోస్తుండగా విద్యుత్ షాక్.. ఒకరి మృతి



జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 8 : పామాయిల్ గెలలు కోస్తుండగా విద్యుత్ వైర్లకు కత్తి తగిలి విద్యుదాఘాతానికి ఒక వ్యక్తి మృతి చెందాడు.లక్కవరం గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు గాంధీ (45) నిమ్మలగూడెంలో పట్టపు మునేశ్వరరావు పొలం లోకి పామాయిల్ గెలలు కోసేందుకు సోమవారం వెళ్లాడు. గెల కోస్తున్న సమయంలో హైలెవెల్ విద్యుత్ వైర్లకు కత్తి తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అతనిని లక్కవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాడు. వైద్యులు. పరీక్షించి అప్ప టికే గాంధీ మృతి చెందినట్లు నిర్ధారించారు. లక్కవరం ఎస్ఐ సుధీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు గాంధీకి భార్య సీతా మహాలక్ష్మి, కుమార్తె ఉన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

ఇద్దరు కొబ్బరి దింపు కార్మికులు మృతి



యలమంచిలి, ఏప్రిల్ 8: యలమంచిలి మండలం కాజ తూర్పు గ్రామ పరిధిలోని జాతీయరహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పూడి అప్పారావు (55), కడియాలు పెదమునియ్య (41) మృతి చెందినట్లు ఎస్ఐ కె.శివన్నా రాయణ తెలిపారు. విశాఖ జిల్లా నక్కపల్లి మండలం ఉప్మాక అగ్రహారం గ్రామానికి చెందిన పూడి అప్పారావు, చిన అనర్ల గ్రామానికి చెందిన కడియాలు పెదమునియ్య కొబ్బరి దింపు కార్మికులుగా పనిచేస్తూ జీవనోపాధి నిమిత్తం పదేళ్లుగా నుంచి అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం గుడిమెళ్లంక గ్రామంలో నివాసం ఉంటున్నారు. పాలకొల్లులో కొబ్బరి దింపు తీసేందుకు అప్పారావు, పెదమునియ్యలు బైక్‌పై సోమవారం ఉదయం గుడిమెళ్లంక నుంచి పాలకొల్లు వెళుతుండగా కాజ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు అప్పారావు కుమారుడు అప్పలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మృతుడి గుర్తింపు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 8: రైలు నుంచి జారిపడి మృతి చెందిన యువకుడిని బంధువులు గుర్తించారు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమడోలు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద రైలు పట్టాలపై మృతి చెంది ఉన్న యువకుడిని బంధువులు గుర్తించారు. ద్వారకాతిరుమల మండలం గొల్లల కాలనీకి చెందిన యన్నంశెట్టి గణేష్ (22) నర్సాపురంలో ఉన్న స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కాలేజీలో ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీకి సెలవులు ఇవ్వడంతో తన స్నేహితులను కలవడానికి ఇంటి నుంచి ఈనెల 6వ తేదీన బయలుదేరి వెళ్ళాడు. అతను రైలులో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడని ఏలూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు వెల్లడించారు.



ఎమ్మెల్యే నానిని కలిసిన రాజీనామా చేసిన వలంటీర్లు

35 మంది వలంటీర్ల రాజీనామాలు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 8:ఎన్నికలు సమీపించే సరికి గ్రామవార్డు, వలంటీర్లు రాజకీయ ముసుగు తొలగింది. ఎన్నికల్లో వైసీపీ తరపున పని చేసేందుకు సిద్ధమైన పలువురు వలంటీర్లు సోమవారం రాజీనామాలు ప్రకటించి అనంతరం అధికారపార్టీ నేతల ముందు ప్రత్యక్షమయ్యారు. జగన్ రుణం తీర్చుకుంటామంటూ ఎమ్మెల్యే ఆళ్ళ నానిని క్యాంప్ కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఏలూరు 16వ డివిజన్‌కు చెందిన 16 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా అనంతరం మహిళా వలంటీర్లు ఎమ్మెల్యే ఆళ్లనానిని క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటామని ప్రతిజ్ఞ కూడా చేయడం విశేషం.

ఉంగుటూరు మండలంలో 12 మంది..

ఉంగుటూరు :ఉంగుటూరు మండలంలో సోమవారం బొమ్మిడి గ్రామంలో 11 మంది, కైకరం-2 సచివాలయంలో ఒకరు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో శర్మ తెలిపారు. గతంలో మండలంలోని 21 మంది వలంటీర్లు రాజీనామా చేయగా సోమవారంతో 32 మంది రాజీనామా చేసినట్లయింది.

సత్రాలలో ఏడుగురు..

ద్వారకాతిరుమల: మండలంలోని సత్రాల పంచాయతీ పరిధిలో ఏడుగురు వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి సప్తగిరికి అందించారు.

రూ.1,35,500 నగదు సీజ్

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 8 : వేగవరం చెక్‌పోస్టు వద్ద ఎస్ఎస్‌టీ సిబ్బంది తనిఖీల్లో ఎ.పోలవరం గ్రామం నుంచి జుత్తిక రామకృష్ణ ద్విచక్ర వాహనంపై రూ.1,35,500 నగదుతో జంగారెడ్డిగూడెం వస్తుండగా ఆధారాలు చూపక పోవడంతో సీజ్ చేశారు. జంగారెడ్డిగూడెం తహసిల్దార్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి స్లీవజోజికి అప్పగించారు.

ఏఎస్ఐ అని చెప్పి రూ.34 వేలు కాజేశాడు

కుక్కునూరు, ఏప్రిల్ 8 : ఏఎస్ఐ అని చెప్పి ఓ మోసగాడు రూ.34 వేలు కాజేసిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. దీనిపై కుక్కునూరు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుక్కునూరు పెట్రోల్ బంక్ యజమానికి ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో "నేను ఏఎస్ఐను మాట్లాడుతున్నాను, మా కానిస్టేబుల్ కుటుంబం ఆసుపత్రిలో ఉంది.. రూ.34 వేలు నాకు ట్రాన్స్‌ఫర్ చేయండి..మీకు డబ్బులిస్తాను" అని ఒక వ్యక్తి ఫోన్ చేశాడు. దీంతో కుక్కునూరు పెట్రోల్ బంక్ యజమాని తనది కరెంట్ అకౌంట్ కావడంతో నగదు బదిలీ చేయడం కుదరదని తెలిపారు. అనంతరం గంట తరువాత మళ్లీ ఫోన్ చేసి నగదు బదిలీ చేయాలని కోరాడు. దీంతో పెట్రోల్‌బంక్ యజమాని బంక్‌లో పనిచేసే కుర్రాడి ఫోన్ నెంబర్ ఇచ్చి అతనికి డబ్బులు ఇచ్చి నగదు బదిలీ చేయించుకోవాలని తెలిపారు. బంక్‌లో పనిచేసే కుర్రాడికి కూడా కుక్కునూరు పోలీస్టేషన్ నుంచి వచ్చే వ్యక్తి నుంచి రూ.34 వేలు డబ్బులు తీసుకుని నగదు ట్రాన్స్‌ఫర్ చేయమని చెప్పాడు. అయితే సదరు మోసగాడు పెట్రోల్ బంక్ వద్దకు రాకుండానే మాటలతో పెట్రోల్ బంక్ కుర్రాడిని ఫోన్‌లోనే బురిడీ కొట్టించాడు. దీంతో నిజంగానే ఏఎస్ఐ అని నమ్మి పెట్రోల్ బంక్ కుర్రాడు రూ.34 వేలు నగదు బదిలీ చేశాడు. అనంతరం నగదు కోసం ఏఎస్ఐ అని చెప్పి నమ్మబలికిన వ్యక్తికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో సోమవారం ఉదయం కుక్కునూరు పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుక్కునూరు ఎస్ఐ రామకృష్ణ ఆ నెంబరును ట్రాక్ చేయగా బెంగుళూరు అని చూపిస్తోంది. కొన్ని రోజులుగా కుక్కునూరు మండలంలో ఆన్‌లైన్ మోసాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికే చేయూత డబ్బులు వేస్తామని చెప్పి రూ.85 వేలు ఒక మహిళ నుంచి, రూ.45 వేలు ఒక చిరు ఉద్యోగి నుంచి కాజేసిన సంఘటనలు జరిగాయి.